బైట వర్షంపడుతోందో లేదో చేతులుసాచి చూస్తూ పిల్లలకు కాగితపు పడవలు, స్టీమర్లు, కత్తిపడవలు చేసి పెడ్తూంటే అప్పుడు ఈ అరువియ్యని షావుకార్లు, దూడనమిలేసిన చీర, రేడియోకి వెళ్ళడానికి చొక్కా లేకపోవడం, ఐదురూపాయలతో ఆలిండియా ప్రయాణం పెట్టుకోవడం యివేమీ జ్ఞాపకంరావు.

మన జీవితం ఎవడో తెలివితక్కువ నాటక రచయిత రాసిన అవక తవక నాటకం కాదుగదా అని అప్పుడప్పుడు నా కనిపిస్తోవుంటుంది.

# పెసరట్టు ప్రేమకథ

**తిం**టే పెసరట్టు తినాలి. రాస్తే ప్రేమకథ రాయాలి.

పెసరట్టు వేయడమా, ప్రేమకథ రాయడమా?

ఏమండోయ్ శ్రీవారూ?

ఒక చిన్నమాట–

పురుషుల హృదయాలకు అడ్డరోడ్డు స్టెయిన్ లెస్‌స్టీల్ టిఫిన్ కారీయరు ద్వారా అని విన్నాను.

స్వెట్టరు అల్లుకోవడమా – సీరియల్ నవల వ్రాయడమా?

కొబ్బరికాయ పచ్చడి ముందా –

కొత్త కథకి ప్లాటుముందా?

ఏదీ తెగడం లేదు. ప్రతిష్టంభన... సమస్యలు తోరణాలుగా కట్టి జీవితం వాకిట్లో గుమ్మానికి వ్రేలాడ దీశాము.

అబ్బ; తలనొప్పి... ఉష్;

ఈ పచ్చడి రుబ్బడం, ఈ మొగుడూ – – ఈ కాపరం... ఇష్! ఏనుగు తలనొప్పి.... పోనీ లక్ష్మిలో సినిమాకి వెళ్ళడమా? డాబా మీద పక్కింటి విమలలా మొగుడితో కబుర్లుచెబుతూ కూర్చోడమా? కాఫీ... టీయా... కోకోయా.... ఏదైనా తలనొప్పి తగ్గించును. తలనొప్పిగా యున్నప్పుడు వేసిన పెసరట్ లేదా రాసిన ప్రేమకథ తలనొప్పిని కలిగించును. కనుక తలనొప్పితో స్వెట్టరు అల్లక సీరియల్ నవల రాయక మీతో వెన్నెట్లో షికారు మంచిదా –

భార్యా భర్తలకు, అయినవారికీ షికారు కారు చవుక. ఒంటికి మంచిది. ఈ పాటికి కమలేం చేస్తూవుంటుంది? వంటింట్లో పొయ్యిముందు చదువుతున్న సీరియలున్న పత్రికని పంచదార డబ్బామీద మూత పెట్టి అది కారుషెడ్డులో కాపురమున్న కామేశ్వరికి కనిపించకుండా

దానిమీద మిరపకాయలు పోసి ఆదివారం పేకాటకొచ్చే మొగుడి స్నేహితులకు ముక్కిపోయిన రవ్వతో ఉప్మా కలియ బెడుతూ వుంటుంది.

ఎదురింటి మెల్లకన్ను దుర్గాంబ మొల్ల రామాయణం బైండు అట్టలమధ్య "దాచిన దాగదు" పాకెట్ నవల చదువుతున్నదల్లా స్టీలు గిన్నెల వాడొస్తే పాతగుడ్డలమూట బయటకుతీసి బేరసారములలో మునిగి తేల్తూ వుంటుంది.

ఇంటివెనక ములగచెట్టు మీనాక్షి ఆవకాయ కాయ తరిగించడం కోసం మేదర కత్తిని లేదా మడత కత్తిపీటను ఎరువు పట్రమ్మని జాలి లేకుండా భర్తను పొడుస్తూ వుంటుంది.

కంట్రాక్టరు సుబ్బారాయుడిగారి విధవ మరదలు మూడోకాలు విరిగిపోయిన విరుగుడు చావ కుర్చీని మెల్లగా రిక్షాలో వేసుకుని ఫర్నిచరు షాపుకు తోలుకెళ్తోంది.

మూలుగుతున్న కుక్కకి కాలికి కట్టుకట్టించుకుని సైకిలుమీద వస్తూ విధవ మరదలు కూర్చున్న రిక్షాని తప్పించబోయి బురదగుంటలో పడ్డ స్టూడెంటుకు కుర్రాడికి మేడమీద బియస్సీ ఫైనలియ్యరు అమ్మాయిచూసి నవ్వడం తల కొట్టేసి నట్లుంది కాబోలు. కుక్క సంగతి సరే సరి!

ఇలాంటి ఆదివారం ఉదయం సమస్యలు తోరణాలు కట్టి వ్రేలాడుతున్న సమయంలో పెసరట్టు వేయాలి. స్వెట్టరు అల్లుకోవాలి. కొబ్బరి కాయ పచ్చడి చేయాలి. ఇన్ని పనుల మధ్య ప్రేమకథ రాయాలనిపిస్తోంది. సీరియల్ నవల తలను బరుకుతోంది. కొత్తకథకి ప్లాటు పుట్టుకొస్తోంది. ఏమాశ్చర్యం; నేనో ఇడియట్‌ని - డాబామీద మీతో హాయిగా కబుర్లు చెప్పుకోక లక్ష్మిలో సినిమాకి వెళ్ళాలని ఆరాట పడుతున్నాను. వెన్నెలను వృధా పోనిచ్చి సినిమాహాల్లో జీవితం ఖర్చు పెట్టడం కంటె కథలూ నవలలూ రాస్తే కీర్తి పెరుగుతుంది. మీరు దుప్పటి కప్పుకుని మంచంమీద గురక పెడుతూంటే నేను నాకీర్తికాంతను, మహా జయకాంతను వెంటేసుకుని గాలి కెరటాలలో తేలియాడి వెండి మబ్బులు వెనక్కువెళ్ళి దాక్కుంటాను. అప్పుడు నిద్రలేచి టూత్ బ్రష్, తువ్వాలూ, నీళ్లూ అందివ్వమని నన్ను పిలుస్తారు. నేను కీర్తి శిఖరాల మీంచి వెండిమబ్బులలో దోగాడుతున్న దానిని మీకు నీళ్లు తొరిపి వీపు తోమి స్నానం చేయిస్తాననుకుంటున్నారా? అప్పుడు మీకేసి నేనుచాలా జాలిగా పిటీ చేస్తూ చూస్తాను.

మీ ఆఫీసు కాగితాలు, వెలసిపోయిన పాంట్లు, మాసిపోయిన చొక్కాలు, బెల్టు తెగినజోళ్ళు. పర్సులో పావలా పరకతో మీరు నా కంటికి పిపీలికంలా కనిపిస్తారు.

నా మెళ్లొ పూలదండలు, నా నెత్తిన సాహిత్య రత్నస్థగిత మణి కిరీటం. నా కాళ్ళను చుట్టి ప్రశంసా పరం పరలు, నాకనుసన్నల మెలగేందుకు తహతహలాడే సరస్వతీపుత్రులు. అప్పుడు మీరొచ్చినా కీర్తి విరజిమ్మే కాంతుల్ని చూసి ఓర్వలేక జుట్టు పీక్కుని నృత్యం చేస్తారు.

ఆ బురదలో ఎందుకలా డాన్స్ చేస్తున్నాడు. హు ఈజ్ దట్ పూర్ మాన్? అంటారంతా.

అయామ్ సారీ - అంటాను నేను మబ్బుల మీద కూర్చుని నవ్వులు చిలుకరిస్తూ.

అదిసర్లెండి కాని. ఒక వేపున మాత్రమే రాసి పోస్టుబిళ్ళలు అంటించిన కాగితాలు కొన్ని పట్రండి. కథో, నవలో, కాకరకాయో వెంటనే పూర్తిచేసి పోస్టుచేయాలి; రన్ ఆన్ - టైం లేదు.